క్లుప్తంగా

కృష్ణానంద స్వామి ఆరాధన

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో బుధవారం కృష్ణానందస్వామి 7వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి సమాధికి నిర్వాహకులు రూపామోహన్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగ పూజ, గాయత్రీ హోమం, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా రోగులకు ఇంటి వద్దకే వైద్యం అందుతోందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి ఆలూరులోని సచివాలయం–3 పరిధిలో రోగుల ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. దీర్ఘకాలిక రోగులకు రక్త, మూత్ర పరీక్షల కోసం శ్యాంపిల్ సేకరించి ఆలూరు సీహెచ్‌సీకి పంపించారు. ఆయన మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వారంలో రెండు సార్లు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని అపాయం ఉంటే తనకు తెలియజేయాలన్నారు. గుండె జబ్బులు, శస్త్రచికిత్సలు అవసరమైన వారి వివరాలు ఆరోగ్య శ్రీ కింద నమోదు చేయించాలన్నారు. 67 మంది వృద్ధులు, గర్భిణులు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఏఎన్‌ఎం యశోధ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

చిప్పగిరి: మండలానికి ఏబీపీ (ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో)గా లక్ష్మీనరసింహ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌చే ఆమోదించబడిన జాయినింగ్ ఆర్డర్‌తో ఎంపీడీఓ కొండయ్యను కలిసి నియామక పత్రం అందించి విధుల్లో చేరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



రూ.15 వేలు సాయం అందజేస్తున్న కొత్తకాపు మధుసూదనరెడ్డి

దేవనకొండ: ఆపదలో ఉన్న వారికి సాయం చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం దేవనకొండలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గతవారం ఎస్సీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమై సర్వం కోల్పోయిన కుటుంబాన్ని పరామర్శించారు. తన వంతు సాయంగా రూ.15 వేలు అందించారు. తెర్నేకల్ సర్పంచ్ అరుణ్ కుమార్, నాయకులు బెల్ ఈరన్న, శ్రీనివాసులు, బడేసాబ్, తిమ్మప్ప, మహేష్, బంగి వీరభద్రప్ప తదితరులు ఉన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

దేవనకొండ: మాదాసి, మాదారి కురువలకు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరుచేయాలని ఆ సంఘం నాయకురాలు మొలగవల్లి శశికళ కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంటింటికీ పిలుపు కార్యక్రమంలో భాగంగా దేవనకొండలో పర్యటించారు. కురువ కులపెద్దలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మాదాసి, మాదారి కురువ ఐక్య సంఘాల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఇంటింటికీ ప్రచారం చేపడతామన్నారు. కురువలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధనకై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఇందుకు కురువ కులస్థులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమె ఇంటింటికి పిలుపు కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. ఆ సంఘం నాయకులు తిమ్మప్ప, కె.బి.పెద్దయ్య, ఓబులేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ లోపాలపై పోరాటం

హొళగుంద: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యారంగ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని పీడీఎస్‌యూ తాలూకా కార్యదర్శి మునిస్వామి పిలుపునిచ్చారు. బుధవారం హొళగుంద పరిధిలో అధ్యక్షులు దుర్గ ప్రసాద్‌నాయక్ అధ్యక్షతన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హొళగుంద మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షులుగా లింగమూర్తి, ఉపాధ్యక్షులు మల్లికార్జున, మండల ప్రధాన కార్యదర్శిగా సిద్ధు,మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారు.

నేటి నుంచి ఉరుసు

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్లు, గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7న గంధం, 8న ఉరుసు, 9న జియారత్ వేడుకలు ఉంటాయని వివరించారు. తిమ్మనచెర్ల విజయభాస్కరరెడ్డి స్వగృహం నుంచి గంధం ఊరేగింపు ఉంటుందని వెల్లడించారు.

ప్రజా సంక్షేమానికి జగనన్నే కొనసాగాలి





ముత్తుకూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం, రామకొండలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా ఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనసాగాలని, ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్ పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఎస్సీ కాలనీ 8వ వార్డు సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును జేసీఎస్ పట్టణ కన్వీనర్లు షబ్బీర్‌అహమ్మద్, బంగి శ్రీరాంలతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. జగనన్న పాలనలో, కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. అలాగే కోట్లాది రూపాయాల నిధులతో గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. మున్సిపల్ ఏఈ శరత్‌కుమార్, కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్, సుధాకర్, రఫీక్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్తుకూరు గ్రామ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్ తోయజాక్షప్పతో కలిసి ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం గుమ్మనూరు ఈశ్వర్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి ప్రజలకు వివరించారు. అలాగే సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందాయని, వచ్చే ఎన్నికల్లో పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ముత్తుకూరులో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు రూ.30.99 కోట్లు అందించినట్లు ఈఓఆర్డీ సూర్యనరసింహారెడ్డి వివరించారు. ఎంపీడీఓ రాణెమ్మ, నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, అశోక్, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామ సచివాలయం (టి.సోమలగూడూరు–1) పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జేసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా, సర్పంచ్ పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీటీసీ జైపాల్‌రెడ్డి చేతుల మీదుగా సంక్షేమ ప్రగతి బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు రూ.12.07 కోట్లు అందించినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, రఘు, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: రామకొండలో సర్పంచ్ హరిత, గౌరవ సలహాదారు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ప్రతిపక్షాల దుష్ప్రచారం, తప్పుడు వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమం ఇంటికే చేరాలంటే మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈఓపీఆర్డీ తిరుపాల్, నాయకులు ప్రకాష్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, సూర్య నారాయణరెడ్డి, నాగరాజు, చాణక్య పాల్గొన్నారు.

వెల్దుర్తి (కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని నర్సాపురం గ్రామ సచివాలయంలో సెక్రటరీ రహమత్, వెల్ఫేర్ అసిస్టెంట్ లాలు, వీహెచ్‌ఏ సువన తదితరుల ఆధ్వర్యంలో సంక్షేమ ప్రగతి బోర్డును వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సర్పరాజాపురం వెంకటేశ్వరరెడ్డి, నర్సాపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించి, ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ చేసిన మోసం, వైఫల్యాలను ఎండగట్టారు. నర్సాపురం గ్రామం సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.17 కోట్లు అందించినట్లు వివరించారు. నాయకులు మహేశ్వరరెడ్డి, ఎల్లారెడ్డి, రమణయ్య శెట్టి, వడ్డె రాజు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని కులుమాల గ్రామంలో జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును అధికారులతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు అందించిన పథకాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి రామ్‌దాస్, నాయకులు శ్రీనివాసులు, సుధాకర్, కాశీం పటేల్, కొండరెడ్డి, జయన్న, వీరేష్, రంగన్న, కనకరాజు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు



పోనకలదిన్నెలో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ పావని, వైఎస్సార్‌సీపీ నాయకులు



కులుమాలలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



వెల్దుర్తి మండలం నర్సాపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సంక్షేమ పాలనకు సహకరించాలి



ఆలూరులో న్యాయవాదులు, సీనియర్ సిటిజన్లతో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఆలూరు: అట్టడుగు వర్గాల వారికి అన్ని విధాలుగా చేయూతనందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి కోరారు. స్థానిక ఆలూరు సివిల్ జూనియర్ జడ్జి కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద బుధవారం న్యాయవాదులు, సీనియర్ సిటిజన్లతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై వారితో చర్చించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా సహకారం అందించాలని కోరారు. వారు సూచించిన అభివృద్ధి పనులను నమోదు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరేష్, కో కన్వీనర్ హనుమయ్య, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, నాయకులు నాగేంద్ర, గంగాధర్‌రెడ్డి, బద్రీ, శంకరప్ప, బాషా తదితరులు ఉన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పేదలకు వరంగా మారిందని సచివాలయ కన్వీనర్ చాంద్‌తాత పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో సి.నాగమణికి బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు నగదు, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఆమె భర్త చాకలి చిన్న వీరేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా మంజూరైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగతా సొమ్ము నామినీ బ్యాంకు ఖాతాలో 15 రోజుల్లోగా జమ అవుతుందన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఉరుకుందు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగస్వామి, భీమన్న పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే



ఎమ్మిగనూరులో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని 16వ వార్డులో కౌన్సిలర్ వాహిద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. పట్టణంలో పక్కా ప్రణాళికతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్ అహమ్మద్, పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, జేసీఎస్ పట్టణ కన్వీనర్లు షబ్బీర్ అహమ్మద్, బంగిశ్రీరాం, వార్డు కౌన్సిలర్లు ఇషాక్, అమాన్, సుధాకర్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు.సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, నాయకులు తిరుమల రెడ్డి, నాగిరెడ్డి, మన్సూర్, జైపాల్ రెడ్డి, బందెనవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వై నాట్ 175కు మద్దతుగా పాదయాత్ర



మదార్‌పురం వద్ద పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వెల్దుర్తి(కృష్ణగిరి): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ, వై నాట్ 175కు మద్దతుగా గుంటూరు జిల్లా మంగళగిరి మండలానికి చెందిన ఏపీ మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టెపోగు బసవరావు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర మంగళ, బుధవారం వెల్దుర్తి వద్ద హైవే–44 మీదుగా సాగింది. ప్రతిరోజు 25 కి.మీ చొప్పున పాదయాత్ర చేపడుతున్నారు. మంగళవారం రాత్రి పాదయాత్ర కర్నూలు మీదుగా మదార్‌పురం చేరుకుంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయన్ను సాదరంగా ఆహ్వానించి వెల్దుర్తిలోని పార్టీ కార్యాలయంలో విడిది ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగ, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ముత్యాల శైలజ, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, ఎస్సీ, ముస్లిం మైనారిటీ మండల కన్వీనర్లు నాయకంటి రాజు, గట్టు ఆరిఫ్, తదితరులతో కలిసి పాతబస్టాండులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్ర కొనసాగించగా పార్టీ శ్రేణులు సంఘీభావంగా పార్టీ జెండాలు చేతబూని కొద్ది దూరం నడిచారు. ఈ సందర్భంగా కట్టెపోగు బసవరావు మాట్లాడుతూ.. నవంబర్ 17న తాను ప్రారంభించిన పాదయాత్రకు అడుగడుగునా సంఘీభావం లభించడం సంతోషమన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి ముఖ్యమంత్రి జగనన్నకు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర వెల్దుర్తికి చేరడంతో 350 కి.మీ పూర్తయ్యిందని డోన్, గుత్తి మీదుగా సాగుతుందని తెలిపారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘననివాళి



ఎమ్మిగనూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రుద్రగౌడ్ తదితరులు



పత్తికొండలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ నారాయణదాస్, ఎంపీడీఓ

ఎమ్మిగనూరు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో బుధవారం ఆయనకు పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజా, కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీపీ కేశన్న, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం రూపకల్పనలో అంబేడ్కర్ సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్‌అహమ్మద్, షబ్బీర్ అహమ్మద్, యుకె రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ తన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బీఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నారాయణదాస్, ఎంపీడీఓ కవిత తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

గోనెగండ్ల: మండల పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాసులు, లస్కర్ వెంకటేష్ బుధవారం రెండు ట్రాక్టర్ల ద్వారా గంజిహళ్లి నుంచి ఎమ్మిగనూరుకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు.

సాగునీరు అందించాలి

పత్తికొండ రూరల్: పందికోన రిజర్వాయర్ పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేసి 60 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలని కోరుతూ బీజేపీ నాయకులు పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంజిత్ కర్ణి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, నాయకులు మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ నీటిని రిజర్వాయర్‌కు మళ్లించి నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. అనంతరం ఆర్డీఓ నీలపు రామలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

రక్తదానానికి ముందుకురావాలి

ఎమ్మిగనూరుటౌన్: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్లు రాజశేఖర్‌గౌడ్, జ్ఞాన ప్రసూన సూచించారు. గురువారం పట్టణంలో హెడ్‌ఎఫ్‌సీ బ్యాంకు, వైష్ణవి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాతలకు నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు.

రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమానికి క్రీడాకారుల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ వలంటీర్లకు సూచించారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుంచి కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 15 ఏళ్ల వయస్సు దాటిన క్రీడాకారుల పేర్లు నమోదు చేయాలన్నారు. విజేతలకు బహుమతులతో పాటు ప్రైజ్ మనీ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ఈ–క్రాప్ తప్పనిసరి

హొళగుంద: మండలంలో రబీ సీజన్‌లో పంటలను సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ శివశంకర్ సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బలగోట, బిలేహాల్, నిట్రవట్టి రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పంట నమోదు వివరాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామాల్లో సాగుచేసిన జొన్న, పప్పుశనగ పంటలను పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. వీఏఏలు వెంకటలక్ష్మి, విజయ్, రాజేంద్ర ఉన్నారు.

కుంగిన ఎస్‌ఎస్ ట్యాంకు కట్ట



కుంగిన హొళగుంద ఎస్‌ఎస్ ట్యాంకు కట్ట

ఆలూరు: హొళగుందలో ఎస్‌ఎస్ ట్యాంకు కట్టకు బీటలు ఏర్పడి కుంగిపోయింది. దీంతో వివిధ గ్రామాలకు తాగునీటి సరఫరాను బుధవారం తాత్కాలికంగా నిలివేశారు. దీంతో మండలంలోని ఐదు గ్రామాల ప్రజల తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య హుటాహుటిన ఎస్‌ఎస్ ట్యాంకు వద్దకు చేరుకుని కుంగిన కట్టను పరిశీలించారు. కట్టపై ఉన్న మట్టి లూజు కావడంతోనే పగుళ్లు వచ్చాయని రెండు, మూడు రోజుల్లోగా మరమ్మతులు చేసి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఆలూరు: హొళగుంద మండలంలోని అనాథలకు స్వామి వివేకానంద ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం వారం రోజులకు సరిపడా బియ్యం, కందిబేడలు, గోధుమపిండి, మంచినూనె తదితర సరుకులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు తమవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

మిచాంగ్ ముప్పుపై అప్రమత్తం

- కీలకంగా వ్యవహరించిన వలంటీర్లు
- అధికారుల సూచనలు ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తం
- ముందు జాగ్రత్తలతో ధాన్యాన్ని కాపాడుకున్న రైతులు



టి.గోకులపాడులో వరి ధాన్యంపై టార్పాలిన్ కప్పుతున్న రైతు



బొందిమడుగులలో మిర్చి దిగుబడిపై టార్పాలిన్ కప్పిన దృశ్యం

కృష్ణగిరి: బంగాళాఖాతంతో ఏర్పడిన మిచాంగ్ తుపాను రైతుల గుండెల్లో దడ పుట్టించింది. వరి కోతలు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతం కావడంతో వెంటనే అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు రైతులను అప్రమత్తం చేశారు. ఏపీపై తుపాను ప్రభావం అధికంగా ఉందని గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేశారు. వలంటీర్లు ఎప్పటికప్పుడు తుపాను పరిస్థితిపై అధికారుల సూచనలను ప్రజలకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేశారు. ఇప్పటికే పంట కోతలు చేపట్టిన రైతులు ధాన్యాన్ని కుప్పలుగా వేసుకుని టార్పాళ్లు కప్పుకోవాలని, కోతలు కోయని వారు రెండు రోజులు వాయిదా వేసుకోవాలని తెలియజేయడం రైతన్నలకు ఎంతో మేలు చేసింది. మండలంలో చిరుజల్లులతోనే తుపాను ప్రభావం సరిపెట్టడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం యంత్రాంగం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అప్రమత్తం చేయకపోతే ధాన్యం పూర్తిగా తడిసిపోయేదని టి.గోకులపాడు గ్రామ రైతులు పేర్కొంటున్నారు. మూడు రోజుల క్రితం కూలీలతో పంటను కోశాం. మామూలుగా అయితే రెండు రోజులు పొలంలో ఎండిన తర్వాత కుప్ప కొట్టుకోవాలి. అయితే తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని వలంటీర్లు ప్రచారం చేయడంతో మరుసటి రోజే పంటను మిషన్‌తో నూర్పిళ్లు చేసి వరి గింజల కుప్ప పడగానే చిరు జల్లులు మొదలయ్యాయి. అప్పటికే సిద్ధం చేసుకున్న టార్పాలిన్ పట్టలను కప్పి ధాన్యం కాపాడుకున్నాం. వలంటీర్లు అప్రమత్తం చేయకపోతే ధాన్యం తడిసి రంగుమారేదని, సకాలంలో సరైన సమాచారం అందించడంతో నష్టం తప్పిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం తరఫున అటు అధికారులు, ఇటు వలంటీర్లు ముందు జాగ్రత్తగా రైతులను అప్రమత్తం చేయడంతో పంటను కాపాడుకున్నామని రైతు సుభాన్ తెలియజేశారు.

నష్టం నివారించుకోగలిగాం



మేము పదెకరాలలో సాగు చేసిన మిరప దిగుబడికి రాగా నాలుగు రోజుల క్రితం కోత కోసి కల్లంలో ఎండబెట్టాం. మిచాంగ్ తుపాను ప్రభావం మండలంలో కూడా ఉంటుందని సచివాలయ అధికారులు, వలంటీర్ లక్ష్మణస్వామి అప్రమత్తం చేశారు. వర్షం పడినా మిర్చి దిగుబడులు తడవకుండా టార్పాలిన్ పట్టలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నాం. సకాలంలో అధికారులు, వలంటీర్ల ద్వారా అప్రమత్తం చేయడం వల్ల నష్టం నివారించుకోగలిగాం.

– ఈశ్వరరెడ్డి, రైతు, బొందిమడుగుల

'ఆడుదాం - ఆంధ్ర' పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

మద్దికెర: యువతీ, యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 'ఆడుదాం– ఆంధ్ర' కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, క్రీడల్లో ఆసక్తి గల క్రీడాకారులను సచివాలయాల్లో గానీ, వలంటీర్ల వద్ద గానీ పేర్లు నమోదు చేయించుకునేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు తమ పరిసరాలలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఎంఈఓలు రంగస్వామి, వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు రంగయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు
70750 09147 (ఎమ్మిగనూరు),
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com